లింగంపల్లి టు కొల్లూరు మరిన్ని బస్సు సర్వీసులు

రాయదుర్గం: లింగంపల్లి నుంచి కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్–2 వరకు మరిన్ని బస్సులను నడపాలని నిర్ణయించినట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్ ఎం శ్రీనాథ్‌గౌడ్ తెలిపారు. ఈ ప్రాంతానికే మరో రూట్లో కొత్తగా నాలుగు బస్సులను నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. లింగంపల్లి నుంచి గోపన్‌పల్లి తాండ, మైఫేఎవెన్యూ, ఎబోడ్ స్కూల్, ఉస్మాన్‌నగర్, కొల్లూరు డబుల్‌బెడ్‌రూమ్ ఫేజ్–2 వరకు బస్సు లను నడుపుతామన్నారు.

ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయాలి

● సైబరాబాద్ సీపీ అవినాష్ మోహంతి



చందానగర్: ఇటీవల రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మియాపూర్, ఆర్సీపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు ట్రాఫిక్ మళ్లింపులను అమలు చేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పోలీస్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం శేరిలింగంపల్లి, చందానగర్, గంగారం, మియాపూర్, హఫీజ్‌పేట్ తదితర ప్రాంతాలలో రోడ్లపై భారీ వరద నీరు చేరిందని దీని వలన భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంటుందని తెలుసుకున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమున్న చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు, సిబ్బందితో కలిసి వరద నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

రాయదుర్గం: విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న రంగాల్లో రాణించాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో భారత ప్రభుత్వం విద్యాశాఖ, 'మనూ'లోని మాస్ కమ్యూనికేషన్, జర్నలిజంతో కలిసి నిర్వహించిన మూడు రోజుల జాతీయ వర్క్‌షాప్ ముగిసింది. డాక్టర్ నాగేంద్రకుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వాన..హైరానా..

● ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం
● ప్రధాన రోడ్లపై భారీగా చేరిన నీరు
● వాహనదారుల ఇక్కట్లు షరా మామూలే
● పరిశీలించిన సైబరాబాద్ సీపీ, జాయింట్‌సీపీ, జీహెచ్ఎంసీ, హైడ్రా బృందం



హెచ్‌సీయూ డిపో ముందు..

గచ్చిబౌలి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు అందరినీ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వర్షాలతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్లన్నింటిపైకి వరదనీరు రావడం, కొన్ని చోట్ల గంటల తరబడి నిలబడడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతూనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గురువారం రాత్రి ప్రారంభమైన వర్షం శుక్రవారంసైతం ఆగుతూ..కురుస్తూ సాగుతూనే ఉండిపోవడంతో అందరూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలతో ఏర్పడుతున్న పరిస్థితులను అంచనా వేయడానికి, వరదనీటిని రోడ్లపై నుంచి తొలగించేందుకు మోటార్లద్వారా తొలగించే ప్రక్రియను సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ, జలమండలి, హైడ్రా అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ప్రధానరోడ్లపైకి వరదనీరు...

ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్లన్నింటిపై వరద నీరు పారుతూ వాహనదారులకు ఇక్కట్లు పడేలా చేసింది.

◆ హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ముందున్న మసీదుబండ రోడ్డు గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు సృష్టించేదిగా మారింది.



పరిశీలిస్తున్న సైబరాబాద్ జాయింట్‌సీపీ గజరావుభూపాల్

◆ ట్రిపుల్‌ఐటీ జంక్షన్ నుంచి హెచ్‌సీయూ వరకున్న రోడ్డు, మాదాపూర్ ప్రధాన రోడ్డు, చందానగర్– ఆల్విన్‌కాలనీ ప్రధాన రోడ్డు, గచ్చిబౌలి నుంచి బయోడైవర్శిటీపార్కు రోడ్డు, విప్రో జంక్షన్, మసీదుబండ హెరిటేజ్ జంక్షన్, బయోడైవర్శిటీ నుంచి మాదాపూర్ వెళ్ళే మైండ్‌స్పేస్ రోడ్డు,డోయన్స్ కాలనీరోడ్డు,బొటానికల్‌గార్డెన్ రోడ్డు, అంజయ్యనగర్‌డ్డులో వరదనీరు వాహనచోదకులను ఇబ్బందులకు గురిచేసింది.

'నిథమ్' క్యాంపస్‌లో బతుకమ్మ సందడి

రాయదుర్గం: ఒక్కేసి పువ్వేసి చందమామ..బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలా..అంటూ ఆడుతూ.. పాడుతూ విద్యార్థులు నిథమ్ క్యాంపస్‌లో సందడి చేశారు, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయినికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఆనవాయితీగా నిథమ్ క్యాంపస్‌లో విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అంతా కలసి బతుకమ్మ ఆడారు. నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి వెంకటరమణ, ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ సూచనల మేరకు బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను నిథమ్ క్యాంపస్‌లోని రామమ్మకుంటలో వదిలారు. కార్యక్రమాన్ని నిథమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ కోఆర్డినేటర్‌గా పర్యవేక్షించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రాఘవేంద్ర కాలనీ సీ బ్లాక్, రాజరాజేశ్వరీ కాలనీ, గోల్డెన్ తులీప్, జెమ్ మోటార్స్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జేవీజీహిల్స్, సెంట్రల్ పార్క్ ఫేజ్–2, ఓయూ ప్రొఫెసర్స్ కాలనీ, మాధవహిల్స్, జాగృతికాలనీ, ఆనంద్‌నగర్ కాలనీ, శ్రీనివాస్ కాలనీ, ప్రశాంత్‌నగర్, కొత్తగూడ విలేజ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అలరించిన స్వరార్చన



మాదాపూర్: కళాకారులు స్వరార్చన కార్యక్రమంలో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శుక్రవారం లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ సంస్థ వ్యవస్థాపకుడు కొమండూరి రామాచారి బృందం సంకీర్తనలను ఆలపించి అలరించారు. కీబోర్డు రాజు, తబల విజయ్ సంగీత సహకారాన్ని అందించారు. కార్యక్రమానికి భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అన్నమయ్య పాటలకు శోభరాజు చేసిన కృషిని గుర్తుచేశారు.

నిజాయితీని చాటుకున్న కండక్టర్

మియాపూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు వదిలివెళ్లిన నగలను అందజేసి కండక్టర్ నిజాయితీని చాటుకున్నారు.డిపో అధికారులు తెలిపిన మేరకు.. ఎస్ఆర్ నగర్‌కు చెందిన మమత బెనర్జీ ఈ నెల 22న కూకట్‌పల్లి నుండి ఎస్ఆర్ నగర్‌కు మియాపూర్ –2డిపో కు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణించింది. అయితే ఆమె తన బ్యాగును బస్సులో మర్చిపోయింది. బ్యాగులో ఉన్న బంగారు నగలు, కొనుగోలు రసీదు ఆధారంగా ప్రయాణికురాలి సమాచారం తెలుసుకుని ఆమెకు తెలియపరిచారు. శుక్రవారం మియాపూర్ – 2 డిపోలో డిపో మేనేజర్ వెంకటేశం గౌడ్ డిపో ఉద్యోగస్తుల సమక్షంలో మమత బెనర్జీకి బ్యాగుతో పాటు బ్యాగులో ఉన్న రెండు గ్రాముల చెవి కమ్మలను అందజేశారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

మియాపూర్: రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తిని కర్రతో కొట్టి హత్యచేసిన ఇద్దరు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మియాపూర్‌లోని రఫా రిహాబిలిటేషన్ సెంటర్‌లో సందీప్ అనే వ్యక్తిని బుధవారం సాయంత్రం ఇద్దరు యువకులు కర్రతో కొట్టి హత్యచేసిన సంఘటన తెలిసిందే. నల్గొండ జిల్లా ఖాజాబౌలికి చెందిన ఆదిల్ అహ్మద్(27) , బండ్లగూడ బాబానగర్‌కు చెందిన షేక్ సులేమాన్(25) మియాపూర్‌లోని రఫా రిహాభిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. అదే సెంటర్‌లో పల్నాడు పిగుడురాళ్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సందీప్ (38) చికిత్స పొందుతున్నాడు. బుధవారం సాయంత్రం గొడవ జరగగా ఆదీల్, సులేమాన్ కలిసి సందీప్‌పై దాడిచేయడంతో మృతిచెందాడు. తండ్రి వెంకట నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

జోయాలుక్కాస్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెల్లరీ షో ప్రారంభం



చందానగర్: చందానగర్ గంగారంలోని జోయాలుక్కాస్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో శుక్రవారం ప్రారంభమమైంది.ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్. జోయ్ ఆలుక్కాస్ మాట్లాడుతూ.. ప్రదర్శన సమయంలో రూ. లక్ష అంతకంటే ఎక్కువ విలువైన ప్రతి డైమండ్ ఆభరణాల కొనుగోలుపై వినియోగదారులకు ఉచితంగా ఒక గ్రాము బంగారం నాణెం లభిస్తుందన్నారు. ఈ ప్రదర్శన అక్టోబర్ 12వ తేది వరకు మాత్రమే కొనసాగుతుందన్నారు. హోప్ ఫౌండేషన్, సంఘ సేవకులు కొండ విజయ్ కుమార్, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్పాట్ పెయింటింగ్

మాదాపూర్ : కళాకారులు వేసిన బతుకమ్మ చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో నిర్వహించిన స్పాట్ బతుకమ్మ చిత్రాల పెయింటింగ్ కాంపిటీషన్ శుక్రవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ, స్థానిక కళాకారులు 35 మంది, ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు 75 మంది పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పర్యటన

రాయదుర్గం: నానక్‌రాంగూడలో టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ శివాజీ ఆధ్వర్యంలో పలువురు అధికారులు శుక్రవారం పర్యటించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పరిస్థితిని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాకు ఆటంకాలు లేకుండా సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు.